## శ్రీరాంనగర్ ఎస్పీహెచ్ఓగా డాక్టర్ విజయనిర్మల



ఎర్రగడ్డ, జూలై 24: శ్రీరాంనగర్ క్లస్టర్ ఎస్పీహెచ్ఓ (స్పెషల్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్)గా డాక్టర్ విజయనిర్మల నియమితులయ్యారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేస్తున్న డాక్టర్ అనురాధ బదిలీపై వెళ్లింది. నూతన ఎస్పీహెచ్ఓ విజయనిర్మల బుధవారం బాధ్యతలను స్వీకరించారు. శ్రీరాంనగర్ క్లస్టర్ పరిధిలోని ఆరు పట్టణ ఆరోగ్య కేంద్రాలకు చెందిన వైద్యాధికారులు ఆమెను కలిశారు.

## కేంద్రం బడ్జెట్ నిరాశాజనకం

హిమాయత్‌నగర్, జూలై 24: కేంద్ర ప్రభుత్వం 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ప్రవేశపెట్టిన బడ్జెట్ నిరాశాజనకంగా ఉందని ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు సయ్యద్ వలీ ఉల్లా ఖాద్రీ, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వదేశీ, విదేశీ సంస్థల కోసం కార్పొరేట్ పన్నులు భారీగా తగ్గించారని అన్నారు. వ్యవసాయం, విద్యారంగానికి సరైన ప్రాధాన్యత ఇవ్వలేదని వారు పేర్కొన్నారు. ప్రతిఏటా 2కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని మోదీ ఇచ్చిన హామీ అబద్ధంగానే మిగిలిపోయిందన్నారు. ప్రభుత్వ రంగంలో ఉన్న ఖాళీల భర్తీ విషయంపై ప్రస్తావన లేదన్నారు. ఈ బడ్జెట్ విద్యార్థి, యువతకు ఎలాంటి మేలు చేసే విధంగా లేదని వారు విమర్శించారు.

## సమస్యలపై దృష్టి పెట్టాలి

జూబ్లీహిల్స్, జూలై 24: జూబ్లీహిల్స్ సర్కిల్‌లో పారిశుధ్య సమస్యలపై దృష్టి పెట్టాలని ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ అనురాగ్ జయంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం జీహెచ్ఎంసీ 18వ సర్కిల్‌లో అధికారులతో కలిసి ఆయా ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికంగా నెలకొన్న సమస్యలను పరిశీలించారు. స్థానికులతో మాట్లాడారు.

# కేటీఆర్ జన్మదిన సంబురాలు

- పలు ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలు
- రక్తదానం చేసిన బీఆర్ఎస్వీ నాయకులు
- కేక్ కట్ చేసి పుట్టిన రోజు వేడుకల నిర్వహణ



హైదర్షాకోట్‌లో కేక్ తినిపిస్తున్న నారాయణ, రాము



శంషాబాద్ మండలం కవ్వగూడలో కేటీఆర్ పుట్టిన రోజు వేడుకలు చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ఎర్రగడ్డ, జూలై 24: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ జన్మదినాన్ని పురస్కరించుకొని బోరబండ డివిజన్ బీఆర్ఎస్ నాయకులు పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఆదేశాల మేరకు బుధవారం పీటీదర్గా సమీపంలోని సర్కారు దవాఖానలో పండ్లు పంపిణీ చేశారు. సైట్-3లో అన్నదానం నిర్వహించారు. బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు కృష్ణమోహన్, ఉపాధ్యక్షుడు యూసుఫ్, నేతలు బాబూరావు, జేఎల్ మేరి, అజయ, రజియా, పద్మ, శ్రీలక్ష్మి, తిరుపతయ్య, గఫార్ పాల్గొన్నారు.

### రక్తదానంతో ప్రాణదానం..

వెంగళరావునగర్: రక్తదానంతో ప్రాణాలు నిలుపవచ్చని, ఆగిపోయే ఊపిరికి ఇచ్చే శ్వాసే రక్తదానమని వెంగళరావునగర్ కార్పొరేటర్ దేదీప్య విజయ్ అన్నారు. బుధవారం బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ జన్మదినం సందర్భంగా ఎర్రగడ్డ ప్రభుత్వ ఛాతి దవాఖానలో రోగులకు ఆమె పండ్లు పంపిణీ చేశారు. అనంతరం బీఆర్ఎస్ భవన్‌లో బీఆర్ఎస్వీ గెల్లు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరం రక్తదానం చేశారు. కేటీఆర్ నిండు నూరేండ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని ఆమె ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాల్లో మాజీ కార్పొరేటర్ శ్యామ్‌రావు, ఆంజనేయులు యాదవ్, అఫ్సర్, పవన్ ముదిరాజ్, మెహబూబ్ తదితరులు పాల్గొన్నారు.

### జన్మదినం.. రక్తదానం

జూబ్లీహిల్స్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పుట్టిన రోజున తలసేమియా వ్యాధిగ్రస్తుల కోసం రక్తదానం నిర్వహించారు. బంజారాహిల్స్‌లోని తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేశారు. కేటీఆర్ అభిమానులు సుదూరప్రాంతాల నుంచి వచ్చి మేము సైతం అంటూ భాగస్వాములయ్యారు. మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలం పెద్దముప్పారం గ్రామానికి చెందిన యువత ప్రాణానికి ప్రాణంగా అభిమానించే నేత జన్మదినం సందర్భంగా రక్తదానం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ సీనియర్ నాయకులు గొడిశాల సంజీవరావు, లింగమల్లు, హరీశ్, వెంకటేశ్, ఉపేందర్, వాసు, మణికుమార్, జయంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### కవ్వగూడలో ఘనంగా...

శంషాబాద్ రూరల్: మాజీ మంత్రి కేటీఆర్ పుట్టినరోజు వేడుకలు శంషాబాద్ మండలం కవ్వగూడలో ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ యువ నాయకులు రోడ్డ నాగేశ్, కుక్కల కృష్ణ, సురేశ్‌ముదిరాజ్, కంచ జంగయ్య, రోడ్డ రవి, సాయి గౌడ్, బోర్ర రాజు, నవీన్‌యాదవ్, ఎం.కృష్ణ, రాజు, రోడ్డ సంతోష్, వంశీగౌడ్, ప్రసాద్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

### హైదర్షాకోట్‌లో..

బండ్లగూడ: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదిన వేడుకలు హైదర్‌షాకోట్‌లో ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి మాజీ చైర్మన్ పులిమామిడి నారాయణ, బీఆర్ఎస్ ట్రేడ్ యూనియన్ నేత వి.రాముడు యాదవ్ కేక్‌కట్ చేసి సంబురాలు నిర్వహించారు.

### బీఆర్ఎస్‌కు పూర్వ వైభవం..

మైలార్‌దేవ్‌పల్లి: బీఆర్ఎస్ పార్టీకి పూర్వ వైభవం రానుందని మైలార్‌దేవ్‌పల్లి బీఆర్ఎస్ యువజన విభాగం అధ్యక్షుడు రఘుయాదవ్ అన్నారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదినం మైలార్‌దేవ్‌పల్లి పరిధిలోని పలు ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు భారీ కేక్‌ను కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి గుమ్మడి కుమార్, మైనార్టీ నాయకులు ముకత్‌చందా, రాజేశ్ యాదవ్, రాముయాదవ్, మైసిరెడ్డి, అరుణ్ ముదిరాజ్, మధు, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.



బోరబండ సర్కారు దవాఖానలో పండ్లు పంపిణీ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



ఎర్రగడ్డ ఛాతి దవాఖానలో పండ్లు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ దేదీప్య, తదితరులు



కేక్‌కట్ చేస్తున్న మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బీఆర్ఎస్ పార్టీ యువజన విభాగం అధ్యక్షుడు రఘుయాదవ్ తదితరులు

## రజక వృత్తిదారుల సమస్యలు ప్రస్తావించాలి



హిమాయత్‌నగర్‌లో సాంబశివరావుకు వినతిపత్రాన్ని అందజేస్తున్న నాయకులు

హిమాయత్‌నగర్, జూలై 24: రాష్ట్రంలోని రజక వృత్తిదారులు ఎదుర్కొంటున్న సమస్యలపై అసెంబ్లీలో ప్రస్తావించి ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లాలని కోరుతూ బుధవారం సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావును రజక సమాఖ్య నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొడ్డుపల్లి కృష్ణ, వృత్తి సంఘాల రాష్ట్ర నేత బొమ్మగాని ప్రభాకర్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఉన్న దోబీఘాట్‌లలో విద్యుత్, నీరు, షెల్టర్ వంటి వసతులు లేక రజకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఎమ్మెల్యే సాంబశివరావు సానుకూలంగా స్పందించారని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎన్.బాలమల్లేశ్, నాయకులు డీజీ సాయిల్‌గౌడ్, కృష్ణ, చంద్రమోహన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## చిన్నారులు భవిష్యత్ తరాలకు మార్గదర్శకులు



పాఠశాల చిన్నారులతో రొటేరియన్స్

వ్యవసాయ యూనివర్సిటీ, జూలై 24: పాఠశాలల్లో కనీస సౌకర్యాలు కల్పిస్తే విద్యార్థుల భవిష్యత్‌కు బాటలు వేసిన వారమవుతామని రొటేరియన్స్ సంస్థ అధ్యక్షుడు శ్రీనివాస్, వర్సిటీ రిటైర్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్, కార్యదర్శి జగదీశ్వర్ అన్నారు. రాజేంద్రనగర్‌లోని గాంధీనగర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. పాఠశాలలో బల్లలు, కుర్చీలు, ప్రహరీ గోడపై చిన్నారులను ఆకర్శించే బొమ్మలతోపాటు కనీస వసతులు కల్పించారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులు, పాఠశాల అధ్యాపకులు డైరెక్టర్ సౌరవ్‌కుమార్, రాంప్రసాద్, జగదీశ్వర్‌కు అభినందనలు తెలిపారు.

## స్మితా సబర్వాల్‌పై చర్యలు తీసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఉదయ లక్ష్మి

ఖైరతాబాద్, జూలై 24: దివ్యాంగులను కించపరుస్తూ ట్విట్టర్‌లో అనుచిత వ్యాఖ్యలు చేసిన ఐఏఎస్ అధికారి స్మితా సబర్వాల్‌పై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఇండియన్ ప్రజా కాంగ్రెస్ పార్టీ దివ్యాంగుల విభాగం జాతీయ ప్రతినిధి ఎస్ఎన్ ఉదయలక్ష్మి అన్నారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో దివ్యాంగ మహా సంఘం జాతీయ అధ్యక్షుడు నందూరి రమేశ్, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.భాస్కర్ నేతతో కలిసి మాట్లాడారు. 2016 దివ్యాంగుల చట్టం ద్వారా వారి భద్రత, భరోసా, రిజర్వేషన్లు కల్పించారన్నారు. వివక్ష పూరితమైన వ్యాఖ్యలు చేయడం విచాకరమన్నారు. స్మితా వ్యాఖ్యలు యావత్ దివ్యాంగులను బాధించిందన్నారు. ఆమె వ్యాఖ్యలను ఖండిస్తూ చర్యలు తీసుకునే వరకు తాము పోరాటం చేస్తామన్నారు.

## బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మానం



ఉపాధ్యాయులను సన్మానిస్తున్న కార్పొరేటర్ సాగర్‌గౌడ్

బండ్లగూడ, జూలై 24: విద్యార్థుల తలరాతలు మార్చి వారిని ఉన్నత శిఖరాలను అధిరోహింపజేసే శక్తి ఉపాధ్యాయులకు మాత్రమే ఉందని కార్పొరేటర్ సాగర్‌గౌడ్ పేర్కొన్నారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మండల ప్రాథమికోన్నత పాఠశాలలో కిష్టయ్య, నర్సింహులు, పార్వతిదేవి, సంజీవ, ప్రియరంజని బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా వారిని కార్పొరేటర్ సాగర్‌గౌడ్ బుధవారం ఘనంగా సన్మానించారు. ఆయన మాట్లాడుతూ.. 12 ఏండ్లుగా ఒకే పాఠశాలలో విద్యా బోధనలు చేయడంతో పాటు స్కూల్ అభివృద్ధికి కృషి చేశారని కొనియాడారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం



సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ వనం సంగీత

వెంగళరావునగర్, జూలై 24: డివిజన్‌లోని ప్రజా సమస్యలు పరిష్కరించడమే ధ్యేయంగా పనిచేస్తున్నట్టు సోమాజిగూడ కార్పొరేటర్ వనం సంగీత శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. బుధవారం డివిజన్ పరిధిలోని నాగార్జునకాలనీ నగదేవత ఆలయం వద్ద నూతనంగా నిర్మిస్తున్న సీసీరోడ్డు నిర్మాణ పనులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో అభివృద్ధి పనులు నిరంతరం కొనసాగుతున్నాయని అన్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు తాను కట్టుబడి ఉన్నానని తెలిపారు. డివిజన్‌లోని ప్రజలకు అన్నివిధాలుగా అండగా ఉండి వారి సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాలనీ సంక్షేమం సంఘం సభ్యులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కేంద్ర బడ్జెట్‌పై నిరసన

జూబ్లీహిల్స్, జూలై 24: కేంద్ర బడ్జెట్‌పై నిరసనలు వెల్లువెత్తాయి. బుధవారం జూబ్లీహిల్స్ నియోజకవర్గ రహ్మత్‌నగర్ డివిజన్‌లో కార్పొరేటర్ సీఎన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఎస్పీఆర్ హిల్స్ రెండు బొమ్మల కూడలిలో కాంగ్రెస్ నేతలు నల్లబ్యాడ్జిలు ధరించి నిరసన తెలిపారు. కార్పొరేటర్ మాట్లాడుతూ.. బడ్జెట్ లో సమన్యాయం కొరవడిందని అన్నారు. 8 మంది ఎంపీలు, ఇద్దరు మంత్రులున్నా ఎలాంటి బడ్జెట్ కేటాయింపు జరుగలేదని ఎద్దేవా చేశారు. రాష్ట్రానికి హక్కుగా రావాల్సిన ప్రాజెక్ట్‌లకు కూడా కేటాయింపు దక్కలేదని పేర్కొన్నారు. దీని కి రాష్ట్ర బీజేపీ బాధ్యత వహించాలన్నారు. తెలంగాణకు బడ్జె ట్ కేటాయింపులో తీవ్ర అన్యాయం జరిగిందని, బడ్జెట్ ప్రజలను అవమానపరిచే విధంగా ఉందని దుయ్యబట్టారు.

## బోర్డు తిప్పేసిన కోచింగ్ సెంటర్

హిమాయత్‌నగర్, జూలై 24: కోర్సు పూర్తి కాకముందే కోచింగ్ సెంటర్ నిర్వాహకుడు బోర్డు తిప్పేయడంపై విద్యార్థులు ఆందోళన చేపట్టారు. నారాయణగూడలోని బైజుస్ ఐఏఎస్ కోచింగ్ సెంటర్ కార్యాలయం ముందు విద్యార్థులు బైఠాయించి తమకు న్యాయం చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. 2022-24 కోర్సు శిక్షణ కోసం ఒక్కొక్క విద్యార్థి నుంచి రూ.లక్ష యాభై వేలను కోచింగ్ సెంటర్ నిర్వాహకులు వసూలు చేశారని అన్నారు. తమ శిక్షణ పూర్తి కాకుండానే మూసివేశారని ఆరోపించారు. పేద, మధ్య తరగతి కుటుంబాలకు చెందిన తాము సివిల్స్ ఉద్యోగాలు సాధించాలనే లక్ష్యంగా శిక్షణ తీసుకుంటున్నామని తెలిపారు. సెంటర్ నిర్వాహకుల వల్ల తమ సమయం వృథా కావడంతోపాటు డబ్బులు సైతం పోగొట్టుకున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంలో ప్రభుత్వం జోక్యం చేసుకొని తమకు న్యాయం చేయాలని కోరారు.

## ఫొటో ఎక్స్‌పో బ్రోచర్ ఆవిష్కరణ



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

మణికొండ, జూలై 24: ఫొటోగ్రాఫర్స్, వీడియో గ్రాఫర్స్ కలిసికట్టుగా ఉంటూ తమ సమస్యలు పరిష్కరించుకోవాలని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ అన్నారు. హైదరాబాద్‌లో జరిగే ఫొటో ఎక్స్‌పో వాల్‌పేపర్ ఆవిష్కరణ నిర్వహించారు. ఈనెల 26, 27, 28 తేదీల్లో జరిగే సదస్సు బ్రోచర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఫొటోగ్రాఫర్లు, వీడియో గ్రాఫర్లు నూతనంగా వచ్చే మెళకువలు తెలుసుకోవాలని తెలిపారు. కార్యక్రమలో ఫ్లోర్ లీడర్ రామకృష్ణారెడ్డి, ప్రెసిడెంట్ ఎం.రాజు, ఉపాధ్యాయులు విజయభాస్కర్, మణికొండ ఫొటోగ్రాఫర్స్, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ యూనియన్ నాయకులు శ్రావణ్‌కుమార్, ఏర్పుల కుమార్ పాల్గొన్నారు.

### రైతు బీమా దరఖాస్తు చేసుకోవాలి

శంషాబాద్ రూరల్, జూలై 24: రైతు బీమా పథకానికి రైతులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి గీతారెడ్డి తెలిపారు. బుధవారం శంషాబాద్ మండలంలో వ్యవసాయ శాఖ అధికారులు పర్యటించారు. రైతు బీమా పథకానికి ఆగస్టు 5 చివరి తేదీ అని తెలిపారు. కార్యక్రమంలో ఏడీఏ లీనారెడ్డి, మండల వ్యవసాయశాఖ అధికారి కవిత, విస్తారణ అధికార రాఘవేందర్ పలు గ్రామాల రైతులు పాల్గొన్నారు.

# రాజేంద్రనగర్ ప్రజలకు అండగా ఉంటా

## బీఆర్ఎస్ నాయకుడు పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి





సమావేశంలో మాట్లాడుతున్న కార్తీక్‌రెడ్డి

మణికొండ, జూలై 24: అధికారం ఉన్నా లేకున్నా ప్రజాసమస్యల పరిష్కారానికి అహర్నిశలు శ్రమించేందుకు సిద్ధంగా ఉన్నామని రాష్ట్ర బీఆర్ఎస్ నాయకుడు పట్లోళ్ల కార్తీక్‌రెడ్డి అన్నారు. మణికొండ మున్సిపాలిటీలో బుధవారం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ పుట్టినరోజు వేడుకలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. నాయకులు, కార్యకర్తలతో కలిసి కేక్ కట్‌చేసి సంబురాలు జరుపుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర సాధన కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా ముందుకు సాగిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ సేవలు ఎప్పటికీ అవసరమన్నారు. కేంద్ర నుంచి నిధులను సాధించాలంటే కాంగ్రెస్ సర్కారుకు సాధ్యం కాదనే విషయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి స్వయంగా ఒప్పుకుంటున్నారని అన్నారు. ప్రతిపక్షనేత కేసీఆర్ అసెంబ్లీకి వస్తేనే కేంద్ర నుంచి నిధులను రాబట్టేందుకు బలం చేకూరుతుందని చెబుతున్నారంటే రాష్ట్రానికి కేసీఆర్ ఎంత అవసరమో ప్రజలు గమనించాలన్నారు. అవగాహన లేని సీఎంతో రాష్ట్ర ప్రజలు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని కార్తీక్‌రెడ్డి తెలిపారు. రాష్ట్ర ఉజ్వల భవిష్యత్తు కోసం ఆనాడు మంత్రిగా కేటీఆర్ అభివృద్ధితో పాటు అనేక ఐటీ కంపెనీలను నగరానికి తీసుకువచ్చేందుకు కృషిచేశారన్నారు. బీఆర్ఎస్ సర్కారు హయాంలో జరిగిన అభివృద్ధే నేడు నగరంలో కనిపిస్తుందన్నారు. కేటీఆర్ లాంటి నాయకత్వంలో పనిచేసేందుకు వేలాదిమంది యువనాయకులు ముందుకు వస్తున్నారని వారే రేపటి బీఆర్ఎస్ పాలకులన్నారు.

ఇంతకన్నా ఇంకేమి అభివృద్ధి చేస్తామని పార్టీ మారారని ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ను విమర్శించారు. నియోజకవర్గానికి కేసీఆర్, కేటీఆర్ ఏమి తక్కువ చేశారో ప్రజల సమక్షంలో చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు దూళిపాళ సీతారాం, కుంభగళ ధన్‌రాజ్, ఉపేందర్‌రెడ్డి, కౌన్సిలర్లు నవీన్‌కుమార్, వసంత్ చౌహాన్, రూపారెడ్డి, లక్ష్మయ్య, నర్సింగ్‌రావు, రాజేంద్రప్రసాద్, రామ సుబ్బారెడ్డి, సురేఖ, దిలీప్, కిరణ్, బాను తదితరులు పాల్గొన్నారు.

# డ్రైవర్లు ఏకాగ్రతతో వాహనాలు నడపాలి

## రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఏసీపీ బాలాజీ



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ట్రాఫిక్ ఏసీపీ బాలాజీ

బండ్లగూడ, జూలై 24: డ్రైవర్లు ఎలాంటి ఒత్తిళ్లకు గురికాకుండా ఏకాగ్రతతో వాహనాలు నడపాలని తద్వారా ప్రమాదాలను నివారించవచ్చని రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఏసీపీ బాలాజీ అన్నారు. టీజీఆర్టీసీ ఆధ్వర్యంలో బుధవారం ప్రమాద రహిత వారోత్సవాలను ప్రారంభించింది. రాజేంద్రనగర్ డిపో మేనేజర్ బద్రినారాయణ బుధవారం డిపోలో ప్రమాద రహిత వారోత్సవాలను నిర్వహించారు. కార్యక్రమానికి రాజేంద్రనగర్ ట్రాఫిక్ ఏసీపీ బాలాజీ, ఇన్‌స్పెక్టర్ కిరణ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు డ్రైవర్లకు ప్రమాదాల నివారణ గురించి అవగాహన కల్పించారు. మద్యం సేవించకుండా వాహనాలు నడపడం, ట్రాఫిక్ నిబంధనలను పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించ వచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ రవికుమార్, ఎస్‌టీఐ సుశీల, సిబ్బంది పాల్గొన్నారు.

**నేటి నుంచి కొండాపూర్‌కు బస్సు సర్వీసులు..**

రాజేంద్రనగర్ ఆరాంఘర్ నుంచి కొండాపూర్‌కు (215) బస్సు సర్వీసులు నేటి నుంచి ప్రారంభిస్తున్నట్లు డిపో మేనేజర్ బద్రినారాయణ తెలిపారు. ఈ అవకాశాన్ని బస్సు ప్రయాణికులు అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## 108 సిబ్బందికి లైఫ్ సేవియర్ అవార్డులు



సయ్యద్ ముక్తార్



పైలట్ బి.అశోక్

మణికొండ, జూలై 24: ప్రాణాలను కాపాడటంలో 108 అత్యవసర అంబులెన్స్ సేవల్లో పనిచేస్తున్న సిబ్బంది చేస్తున్న కృషి ఎంతో గొప్పదని 108 సంస్థ ప్రధాన కార్యనిర్వాహక అధికారి(తెలంగాణ స్టేట్ హెడ్) ఎంఏ ఖాలిద్ అన్నారు. అంబులెన్స్ సేవల్లో ఏప్రిల్, మే, జూన్ త్రైమాసికంలో రాష్ట్రస్థాయిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన మెడికల్ టెక్నిషియన్ సయ్యద్ ముక్తార్ అహ్మద్, పైలట్ బి.అశోక్‌కు లైఫ్ సేవియర్ అవార్డులు దక్కాయి. సంస్థ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో వారిని అభినందించి అవార్డులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా ప్రోగ్రాం మేనేజర్ జానషాహిద్, జిల్లా మేనేజర్ రహీం పాల్గొన్నారు.

## బోనాల నిర్వహణకు ఏర్పాట్లు



జూబ్లీహిల్స్, జూలై 24: బోనాల ఉత్సవాలకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని రహ్మత్‌నగర్ కార్పొరేటర్ సీఎన్ రెడ్డి అధికారులను కోరారు. బుధవారం బ్రహ్మశంకర్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో నిర్వహించిన సన్నాహక సమావేశంలో పాల్గొన్నారు. డీసీ సేవా ఇస్లావత్ మాట్లాడుతూ.. ఆలయాల వద్ద అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పనులు చేపట్టాలన్నారు. ఈఈ రాజ్‌కుమార్, డిప్యూటీ ఈఈ శ్రీరాములు, ఏఎంసీ బాలరాజ్, ఎస్ఎస్ విజయ్‌కుమార్, ఎంటమాలజీ ఏఈ సావిత్రి, యూబీడీ మేనేజర్ యూసుఫ్ పాష సిబ్బంది పాల్గొన్నారు.

# మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలి

శంషాబాద్, జూలై 24: మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని శంషాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ పిలుపునిచ్చారు. బుధవారం శంషాబాద్ మున్సిపాలిటీ పరిధి 18వ వార్డులో చైర్‌పర్సన్, వైస్‌చైర్మన్ బండిగోపాల్‌యాదవ్, కమిషనర్ సుమన్‌రావుతో కలిసి ఇంటింటికి మొక్కలు పంపిణీ చేశారు. వారు మాట్లాడుతూ వన మహోత్సవం విజయవంతం చేయడం కోసం ప్రజలు సహకరించాలని కోరారు. 25 వార్డుల్లో ప్రతిఇంటికి మొక్కలు పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ లక్ష్మయ్య, అధికారులు పాల్గొన్నారు.

### ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలి

బండ్లగూడ: ప్రతిఒక్కరూ తమ ఇంటి అవరణలో మొక్కలు నాటాలని బండ్లగూడ జాగీర్ మున్సిపల్ మేయర్ లతాపేమ్‌గౌడ్ అన్నారు. బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వికాస్‌నగర్‌లో బుధవారం వన మహోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ ముఖ్యఅతిథిగా విచ్చేసి కాలనీవాసులకు మొక్కలను పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. మొక్కలను పెంచడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు ఎంతో దోహదపడుతయన్నారు. ప్రజలందరూ ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.

### శివసాయినగర్‌లో..

బండ్లగూడ: శివసాయినగర్‌లో కార్పొరేటర్ తలారి చంద్రశేఖర్ బుధవారం ఇంటింటికీ మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వన మహోత్సవంలో భాగంగా ప్రతిఇంటికి మొక్కలను అందజేసినట్లు తెలిపారు. ప్రజలందరూ ఇంటి ఆవరణలో మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు పాల్గొన్నారు.

## 'కదిరె' వ్యాఖ్యలను వక్రీకరించారు..

ఖైరతాబాద్, జూలై 24: తిరుపతి వెంకటేశ్వర స్వామిపై డాక్టర్ కదిరె కృష్ణ చేసిన వ్యాఖ్యలు వక్రీకరించారని ప్రొఫెసర్ ప్రభంజన్‌యాదవ్ అన్నారు. చికోటి ప్రవీణ్ అనే కృష్ణపై అసత్యపు ఆరోపణలు చేస్తున్నారని బహుజన సేన ఆధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వాసు కె.యాదవ్‌తో కలిసి మాట్లాడారు. కదిరె కృష్ణ అనుచిత వ్యాఖ్యలు చేశారన్న ప్రచారంలో వాస్తవం లేదన్నారు. సంస్కృతంలో ఉన్న సుప్రభాతాన్ని తెలుగులో వివరించిన వీడియోలను చూసి ఆరోపణలు చేస్తున్నారన్నారు. ఉన్నత విద్యావంతుడైన కదిరె కృష్ణను జంతువులకు పుట్టారా అంటూ చికోటి ప్రవీణ్ వ్యాఖ్యానిస్తున్నాడని ఇది తగదని సూచించారు. దాడులకు పాల్పడుతామంటూ బెదిరించడం సరికాదన్నారు. కదిరె కృష్ణకు ఏదైనా ఆపద తలపెడితే బహుజన సేన చూస్తూ ఊరుకోదన్నారు. ఈ సమావేశంలో వెంకట్ బంజారా, సునీత, రాజేశ్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు.